క్లుప్తంగా

గొయ్యిని పూడ్చరూ



పొలాలకు వెళ్లే మార్గంలో పడిన గొయ్యి

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం రోడ్డులో రంధ్రం పడి పలువురు ప్రమాదాలపాలవుతున్నారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి వేగుల గుడికి మీదుగా పొలాలకు వెళ్లే రోడ్డు మధ్యలో మురుగు కాల్వ తూర వారం రోజుల క్రితం పగిలి రోడ్డుపైకి నీరు వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ గ్రామ రైతు బస్వా శేషారావు పేర్కొన్నారు. అధికారులు స్పందించి కొత్త తూర ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. ప్రమాదాన్ని గుర్తించిన రైతు శేషారావు గొయ్యిని గుర్తించే విధంగా కర్ర ఏర్పాటు చేశాడు.

అధికారులూ అప్రమత్తంగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: నియోజకవర్గంలో కలెక్టర్ మంగళవారం పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎం.ఉషారాణి తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయా శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. మంగళవారం అందుబాటులో ఉండని సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణ మూర్తి, ఎంఈఓలు శర్మ, చౌదరి, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఏపీఓ ప్రభాకరరావు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బోధనలో సృజన జోడించాలి



బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు చేసిన ప్రాజెక్టు వద్ద ఎంఈఓలు ఎంఈఓలు శివరామకృష్ణయ్య, పుల్లయ్య

సామర్లకోట: ఉపాధ్యాయులు తమ బోధనలో సృజనాత్మకత జోడించి విద్యార్థులను ఆకర్షించడం ద్వారా నేర్చుకున్న అంశాలపై పట్టు ఏర్పడుతుందని ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా మొదటి రోజు టీఎల్‌ఎం ప్రదర్శనను ఎంఈఓలు సోమవారం మధ్యాహ్నం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శన ఆకట్టుకుంది. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పజిల్స్, వర్కింగ్ మోడల్స్, త్రిడీ నమూనాలు అలరించాయి. చాందిని అనే విద్యార్థిని తయారు చేసిన ప్రాజెక్టును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్ఠు నియంత్రణకు సహకరించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: కుష్ఠు వ్యాధి నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని వైద్య సిబ్బంది ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం గొల్లప్రోలు మండలం కొడవలిలో కుష్ఠు వ్యాధి నిర్ధారణకు సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వెంటనే వైద్య సేవలందించడం ద్వారా వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. సకాలంలో వ్యాధి నిర్ధారణ చేయడం వల్ల వైద్య సేవలు అంది, వ్యాధి తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇంటికీ తిరిగి సర్వే చేయడం ద్వారా వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాషా, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం

- అర్జీల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్ కమిటీ
- కలెక్టర్ షాన్ మోహన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందజేస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం పిఠాపురం రథాలపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పిఠాపురం నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సిఫార్సు చేస్తూ, వాటిపై త్వరితగతిన, సమగ్ర, సంతృప్తికర పరిష్కారాలు అందించాలని మండల, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ప్రధానంగా రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూ రికార్డుల ఆన్‌లైన్, డ్రైన్ల సమస్యలు, శ్మశాన వాటికకు స్థలం మంజూరు తదితర అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ సూచనల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి రెండు వారాలకోసారి నిర్వహిస్తున్నామన్నారు. ఈ అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షిస్తామన్నారు. అర్జీదారులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్థికంగా ముడిపడిన అర్జీలపై నిధుల మంజూరయ్యాక పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు జారీ అయిన వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ నియామకాలపై విచారణ చేయాలి

పిఠాపురం మున్సిపాలిటీలో ఇటీవల ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించిన ఏడుగురి నియామకాలపై విచారణ జరపాలని పలువురు కౌన్సిలర్లు కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్సులో డీఎల్‌డీఓ నారాయణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఇటీవల ఆ ఏడుగురిని ఏ విధమైన నిబంధనలు పాటించకుండా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో, ఏకపక్షంగా నియమించారని వారన్నారు. ఈ నియామకాల్లో భారీ అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. సాధారణంగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబాలకు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యమివ్వాలని, కానీ ఎటువంటి ప్రాధాన్యం లేకుండా, ముడుపులు తీసుకుని ఉద్యోగాల్లో నియమించారని ఆరోపించారు. దీంతో గతంలో పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన వారిని తొలగించి, అర్హులైన వారికి ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్లు పెదపాటి నాగేశ్వరరావు, బోను దేవ, నగేష్, ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంబంధిత అధికారులకు అర్జీలు



గ్రీవెన్స్ సిస్టమ్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్) నిర్వహించనున్నట్టు ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ అన్నారు. ఇందులో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఆరు అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీనీ సంబంధిత శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులను ఇప్పటికే ఆదేశించినట్టు ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, సీడీపీఓ ఉష తదితరులు పాల్గొన్నారు.

ఆగని వానలతో వేదన



సామర్లకోట ఉప్పువారి సత్రం వద్ద నీటిలో ఉన్న వరి పొలాలు



వేట్లపాలెంలో మునిగిన పొలాలను పరిశీలించి సూచనలిస్తున్న ఏడీఏ, ఏఓలు

- అంతకంతకూ పెరుగుతున్న రైతుల కష్టాలు
- నీళ్లలో నానుతున్న పంట పొలాలు

సామర్లకోట: పది రోజులుగా వర్షాలు కురవడడంతో రైతుల కష్టాలు పెరిగిపోతున్నాయి. మండల పరిధిలో 22,500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టాల్సి ఉండగా ఇప్పటికే 15 వేల ఎకరాల్లో వెదజల్లు పద్ధతిలో సాగు పూర్తి చేశారు. మరో 500 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. 80 ఎకరాల్లో ఆకు మడులు ఉన్నాయి. తాజాగా కురుస్తున్న వానలతో చెరువులు పొంగి పొలాలను ముంచెత్తుతున్నాయి. పొలాల్లో నీరు బయటకు పోయే మార్గం లేక నీటిలోనే నాని పోయి కుళ్లిపోతున్నాయి. మండల పరిధిలో మామిళ్లదొడ్డి, వీకే రాయపురం, ఉండూరు, వేట్లపాలెం, సామర్లకోటలోని ఉప్పువారి సత్రం వద్ద పంట భూములు వర్షపు నీటిలో మునిగి పోయాయి. ఇప్పటికే దుక్కి దున్నేందుకు, నాట్లకు ఎకరానికి రూ.ఐదు వేల వరకు వ్యయమైందని, ఆ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు, ఆకు మళ్లు కుళ్లిపోయే అవకాశం ఉన్నదని, దాంతో తిరిగి దమ్ములు చేసి వరినాట్లు వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన చెందుతున్నారు. దాంతో అదనంగా మరో రూ.ఐదు వేల వరకు పెట్టుబడి అవుతుందని రైతులు చెప్తున్నారు.

ముంపు పొలాల పరిశీలన

సామర్లకోట: మండల పరిధిలో ముంపునకు గురైన పొలాలను జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఎం.రత్నకాంతి సోమవారం పరిశీలించారు. గొంచాల, అచ్చంపేట, వేట్లపాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. సుమారు వెయ్యి ఎకరాలల్లో మొలక దశ నుంచి మొక్క దశలో ఉన్న పంట నీటిలో మునిగినట్టు గుర్తించామన్నారు. వర్షాలకు నారుమడిలో విత్తనం చల్లిన మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా నీరు బయటకు తీయాలని సూచించారు. నీరు తీసి వేసిన తరువాత ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పోటాష్ వేసుకోవాలన్నారు. పిలక దశలో పంట మునిగితే నీరు బయటకు తీసిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పోటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఐ సత్య, ఎంఈఓ ఎం.వెంకటసతీష్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధం కావాలి



రాక్ సిరామిక్స్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ ఇప్పటికే 24 మంది కార్మికులను తొలగించగా మరో 40 మంది ఆంధ్రా కార్మికులను తొలగించడానికి రాక్ యాజమాన్యం రంగం సిద్ధం చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ ఆరోపించారు. స్థానిక ఫ్యాక్టరీ గేటు ఎదురుగా తొలగించిన కార్మికులు చేస్తున్న ఆందోళన సోమవారం జోరున వర్షంలోను కొనసాగింది. క్రాంతికుమార్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ యజ మాన్యం కార్మికుల తొలగింపును నివారించాలంటే కార్మికులందరూ టోకెన్ సమ్మెకు సిద్ధపడాలని పిలుపు నిచ్చారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఆంధ్రా కార్మికులను పూర్తిగా తొలగించి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తెచ్చి పెట్టుకొంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులు కార్మికుల పక్షాన నిలబడాలని కోరుతున్నామన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆందోళనలో కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా పిఠాపురం రోడ్డు



సామర్లకోట-పిఠాపురం రోడ్డులో చెత్త వేస్తున్న మున్సిపల్ ట్రాక్టరు

సామర్లకోట: పిఠాపురం రోడ్డును డంపింగ్ యార్డుగా తయారు చేస్తున్నారు. పట్టణ పరిధిలో తొలగించిన చెత్తను మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డులో వేయాల్సి ఉంది. అయితే మున్సిపాలిటీ ట్రాక్టర్లలో సేకరించిన చెత్తను పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువ వెంబడి వేస్తున్నారు. అసలే వర్షాలతో బ్రౌన్‌పేట ప్రాంతం బురదమయంగా ఉండగా చెత్తను ఆ సమీపంలోనే వేసేస్తున్నారు. దీనివల్ల పిఠాపురం నుంచి సామర్లకోటకు వచ్చే ముఖ ద్వారం చెత్తతో స్వాగతం పలికే అవకాశం ఉంది. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావును వివరణ కొరగా చెత్తను తీసుకువెళ్లే వాహనాలు వెళ్లే పరిస్థితి లేని కారణంగా అక్కడ వేసి ఉండవచ్చునని తెలిపారు. దీనిపై కమిషనర్ జె. రామారావు మాట్లాడుతూ డంపింగ్ యార్డులో మాత్రమే చెత్త వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరం అయితే డంపింగ్ యార్డుకు వెళ్లు మార్గానికి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.

నవోదయలో శిక్షా సప్తాహ్



నవోదయలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణయ్య

పెద్దాపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో శిక్షా సప్తాహ్ నిర్వహించనున్నట్లు విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అన్నారు. సోమవారం స్థానిక విద్యాలయలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులకు ఇచ్చే శిక్షణ అంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ భారత ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్ని సీబీఎస్‌యూ విద్యాసంస్థల్లో 22 నుంచి 28వ తేదీ వరకు విద్యావారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి రోజు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ డే, రెండో రోజు రీడింగ్, లిజనింగ్, స్పీకింగ్, రైటింగ్ స్కిల్‌పై అవగాహన, మూడో రోజు గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అఖరి రోజు డిజిటల్ ఇన్ఫర్మేషన్‌పై అవగాహన సదస్సులో శిక్షా సప్తాహ్ ముగుస్తుందన్నారు. విద్యాలయ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ సనపల సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌సీసీ ప్రాముఖ్యం, ఉజ్వల భవిష్యత్‌కై ఎన్‌సీసీ పాత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సుధీర్‌కుమార్, డి.చక్రవర్తి, ఎస్.ఆల్బర్ట్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



వాకతిప్పలో నిర్వహిస్తున్న ర్యాలీ



చేబ్రోలులో ర్యాలీలో పాల్గొన్న అధికారులు

కొత్తపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతందని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. మండలంలోని వాకతిప్పలో సోమవారం సర్పంచ్ పాలాని దొరబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛత వారోత్సవాలను నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా చివరి వారం అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ర్యాలీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం, పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం, ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపర్చడం వంటి కార్యక్రమాలు చేపడతారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చేబ్రోలులో..

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు గ్రామంలో మెప్మా పీడీ ప్రియంవద, ఎంపీడీఓ జయప్రకాష్‌రావు ఆధ్వర్యంలో గ్రామంలో స్వచ్ఛత ర్యాలీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదని, పర్యావరణాన్ని కాపాడాలని, రోడ్లపై చెత్త వేయరాదని దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక నాయకులు ఓదూరి నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



హుస్సేన్‌పురంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ అవగాహన ర్యాలీ

ఉత్సాహంగా స్వచ్ఛ భారత్ ర్యాలీ

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురంలో సోమవారం స్వచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణసత్యారెడ్డి ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా తడిచెత్త, పొడి చెత్తలకు డస్ట్‌బిన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు, సర్పంచ్ మార్ని నాగమణి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పెద్దాపురం: పరిసరాల పరిశుభ్రత బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్వచ్ఛ అవగాహనా ర్యాలీని వారు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రజారోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, తూతిక రాజు, సకురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు కష్ట కాలం

- వర్షాలతో పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలంటున్న పశు వైద్యులు



పశువుల పాకలో ఉన్న గేదెలు

పిఠాపురం: కొద్ది రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోపోతే పశువులకు ప్రాణాపాయమని పశు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాడి రైతులు అప్రమత్తం కాకపోతే రూ.లక్షల విలువైన పశువులు మృత్యువాత పడి తీవ్ర నష్టాల పాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. వర్షాలు ప్రారంభం కావడంతో, కొత్త నీటితో చెరువులు, కాలువలు నిండి కళకళలాడతాయి. కొత్త పచ్చిక వచ్చి పశువుల నోరూరిస్తుంది. దీంతో వాటిని తిన్న పశువులు అనుకోకుండా వ్యాధుల బారిన పడుతుంటాయి. రోగం తెలుసుకుని చికిత్స చేయించేలోపే ప్రాణాలు పోయే పరిస్థితులు నెలకొంటాయి. కురిసే వాన జల్లులు, వీచే చలి గాలులు పశువులపై దుష్ప్రభావం చూపుతాయి. సాధారణంగా కొత్త పచ్చిక. కొత్త నీరు, ముసిరే ఈగలు, దోమల వల్ల వర్షాలు ప్రారంభమైన రోజుల్లో పశువులకు గొంతు వాపు, జబ్బ వాపు, గాలికుంటు, పొదుగు వాపు, జ్వరాలు, కుందేటి వెర్రి, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. పాడి పశువుల్లో పాల సామర్థ్యం తగ్గడంతో పాటు, అవి చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు.

వ్యాధులు ఇలా..

కొత్తగా వర్షాలు పడడం వల్ల కొత్తగా మొలిచిన గడ్డి తినడం, చెరువులు గుంతల్లో చేరిన నీరు తాగడం వల్ల పశువుల్లో ఎక్కువగా వ్యాధులు వ్యాపిస్తాయి. వీటిలో జబ్బవాపు వల్ల పశువుల జబ్బ వాయడం, జ్వరం అధికంగా రావడం, 24 గంటల్లో వైద్య సేవలు అందకపోతే కడుపు ఉబ్బి చనిపోవడం సంభవిస్తుంది. గొంతువాపు వ్యాధి ఎక్కువగా అన్ని వయసు గేదెలకు వ్యాపిస్తుంది. గొంతు వాచి, అత్యధికంగా 106 నుంచి 107 వరకు జ్వరం వచ్చి, శ్వాస పీల్చడం కష్టమై, 12 గంటల్లో చనిపోయే అవకాశం ఉంది. గాలికుంటు వ్యాధి సోకితే నోటిలో, కాళ్లల్లో కురుపులు ఏర్పడి, పశువులు మేత తినక క్షీణించి, పాల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు, పెరుగుదల ఉండదు. పశువులకు గర్భం పోవడం, చూలి కట్టక పోవడం వంటి సమస్యలుంటాయి. జలగ తెగులు వర్షాలు పడినప్పుడు కొత్తగా వచ్చిన నీటి ద్వారా వ్యాపిస్తుంది. కొత్త నీటిని తాగిన పశువుల కడుపులోకి నీటి ద్వారా జలగలు ప్రవేశించి, పోషకాహార లోపాలను కలగజేస్తుంది. తద్వారా పశువులు పూర్తిగా నీరసించి పోతాయి. పొదుగు వాపు వ్యాధి పశువుల శాలల్లో అపరిశుభ్రత వల్ల వస్తుంది. వర్షాలు పడిన సమయంలో వాన జల్లులు పశువుల శాలల్లో పడడం వల్ల పేడ, మూత్రంతో కలిసి పరాన్న జీవులు పెరిగి వ్యాధులు సంక్రమిస్తాయి.

నియోజకవర్గంలో పశువుల వివరాలు

గేదెలు	17,720
ఆవులు	8,465
మేకలు	19,890
గొర్రెలు	16,843

జాగ్రత్త పడాలి

ప్రస్తుతం పడిన వర్షాల ప్రభావం ఎక్కువగానే పశువులపై ఉంటుంది. రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ వ్యాధులు రాకుండా టీకాలను ఉచితంగా పంపిణీ చేస్తుంది. రైతులు వాటిని తమ పశువులకు ముందుగా వేయించడం ద్వారా వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చు. పశువులు గుంతలు, చెరువుల్లో కలుషిత నీరు, నిల్వ ఉన్న నీటిలో కలిసిన కొత్త నీరు తాగకుండా జాగ్రత్తలు పాటించాలి. వర్షం పడిన సమయంలో పశువుల శాలలను పొడిగా ఉండేలా చూడాలి. ఈగలు, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. బూటాక్స్ వంటి మందులను ఒక లీటరు నీటిలో 5 మి.లీ. మందును కలిపి పశువులు, పశువుల శాలల్లో పూర్తిగా తడిసే విధంగా పిచికారీ చేయాలి.

– డాక్టర్ టీఎస్ రమేష్‌చంద్ర, ఏడీ, పశు సంవర్థక శాఖ, పిఠాపురం